
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 26 । ఆగస్టు । 2024



31.413 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయం ఆదివారానికి 31.413 టీఎంసీలకు చేరుకుంది. ఫైతట్టు నుంచి 15,675 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. కండలేరుకు 2 వేలు, దిగువ 560 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,695
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,896
నవర (8 గ్రాములు)	రూ.55,168

గరిష్టం/కనిష్టం
37.3 /29.4

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ మేఘావృతంగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వాతావరణంలో తేమ 43 శాతం ఉంది.

మహిళా డాక్టర్లకు వార్డుల్లోనే గదులు కేటాయించాలి



మహిళా జూనియర్ డాక్టర్లు సైతం ఒక్కో దఫా 24 గంటలు, అంతకు మించి పనిచేయాల్సి ఉంటుంది. రాత్రి పూట విధుల్లో ఉన్నప్పుడు వార్డుల్లో డాక్టర్లకు కనీస సదుపాయాలు ఉండడం లేదు. వాష్‌రూమ్‌కు వార్డు దాటి దూరంగా వెళ్లాలి. ఇలాంటప్పుడు భయంతో బిక్కు, బిక్కుమంటూనే విధులు నిర్వర్తించాల్సి ఉంది. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి రోగులు ఉండే వార్డు వద్దనే ప్రత్యేకంగా వాష్‌రూం, రెస్ట్ రూం ఏర్పాటు చేయాలి.
– బి.బ్లెస్సీ, ఆర్థోపెడిక్ జూనియర్ డాక్టర్

మహిళల రక్షణ అందరి బాధ్యత



మహిళల రక్షణ అందరి బాధ్యత. మృగాళ్లను కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలి. సుప్రీంకోర్టు డాక్టర్ల రక్షణకు కమిటీని ఏర్పాటు చేయడం కొంత వరకు ఊరటనిస్తోంది. కోల్‌కతా ఘటనలో హత్యాచారానికి గురైన యువ వైద్యురాలి కుటుంబ సభ్యులకు న్యాయం జరగాలి. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందితో పాటు ప్రతి మహిళకు రక్షణ ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. మహిళలు విధుల్లో ఉండే ప్రతి చోట సెక్యూరిటీని పెంచాలి. – డాక్టర్ బ్రిజిత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం



డ్యూటీలో ఉండే డాక్టర్ల రక్షణకు ముఖ్యంగా మహిళా డాక్టర్ల భద్రతకు ప్రత్యేక చట్టం అవసరం. ఆస్పత్రుల్లో డ్యూటీలో ఉండే మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకే ప్రతి ఒక్కరు రక్షణ కవచంలా ఉండాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళ మహిళలు విధుల్లో ఉండే ప్రతి చోట పోలీసులతో బీట్ ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి. కోల్‌కతా ఘటనలో దోషులను తక్షణమే శిక్షించాలి. – డాక్టర్ కె.సుబ్బారావు, విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, కావలి

న్యూస్‌రీల్

కామాక్షితాయి సేవలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి



తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న గీత, చంద్రకుమార్ దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి గీత, చంద్రకుమార్ దంపతులు ఆదివారం జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు వారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అతిథులను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కందుకూరు సబ్ కలెక్టర్‌గా తిరుమాని శ్రీపూజ



కందుకూరు: కందుకూరు సబ్‌కలెక్టర్‌గా 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి తిరుమాని శ్రీపూజ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దొంగపిండి గ్రామానికి చెందిన తిరుమాని శ్రీపూజ ఎన్ఐటీ సూరత్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత సివిల్స్ లక్ష్యంగా సిద్ధమయ్యారు. 2022 సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో జాతీయ స్థాయిలో 62వ ర్యాంకు సాధించి ఎంపికయ్యారు. రెండేళ్ల శిక్షణ అనంతరం మొదటి పోస్టింగ్‌లో కందుకూరు సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి. విద్యాధరిని ప్రభుత్వం చిత్తూరు జేసీగా నియమించింది.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సెలవు

నెల్లూరు(దర్గామిట్ట): కృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో సోమవారం నిర్వహించనున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినతులు ఇవ్వాలనుకుంటున్న జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని ఆయన కోరారు.

పోలీస్ ఫిర్యాదులకు..

నెల్లూరు (క్రైమ్): కృష్ణాష్టమి పండగ సందర్భంగా సోమవారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్‌హాల్లో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా పోలీసుశాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఫిర్యాదుల కోసం వచ్చే ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించింది.

పారదర్శకంగా బదిలీలు

- డీఎఫ్ఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీఎఫ్ఓ చంద్రశేఖర్

నెల్లూరు (అర్బన్): అటవీశాఖలో అందరి అభిప్రాయాలను తీసుకుని ఎవరికీ ఇబ్బంది కలుగకుండా పారదర్శకంగా బదిలీలు చేపడుతామని జిల్లా అటవీశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులతో స్థానిక వేదాయపాళెంలోని అటవీ శాఖ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి యూనియన్ నాయకుల సలహాలు స్వీకరించారు. డీఎఫ్ఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ బదిలీల్లో సీనియారిటీ, ప్రభుత్వ నిబంధనలను పాటించేందుకు సహకరించాలన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు తల్లికి వందనం పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని కాపాడేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిచ్చిరెడ్డి, రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తోడేస్తున్న జ్వరాలు



- ఈ నెల్లో 2 వేల వరకు డెంగీ జ్వర పీడితుల నమోదు
- వైరల్ ఫీవర్స్ టెస్ట్‌లతో ఆస్పత్రులు, ల్యాబ్‌లు కిటకిట
- జ్వరాలు ప్రబలుతున్నా.. చోద్యం చూస్తున్న వైద్యశాఖ
- ఫీవర్ సర్వే చేయకుండానే జ్వరాలే లేవంటున్న వైద్యాధికారులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జిల్లాలో డెంగీ, మలేరియా వంటి జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఓ వైపు డెంగీతో నిండు ప్రాణాలు రాలిపోతున్నా.. వైద్యశాఖ చోద్యం చూస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఇద్దరు డెంగీతో మృతి చెందినట్లు స్పష్టమైనా.. వైద్యశాఖ మాత్రం అవి డెంగీ జ్వరాలే కాదంటూ బుకాయిస్తోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వర్షాకాలం ప్రారంభం కాగానే ప్రతి ఇంటా ఫీవర్ సర్వే చేయించి, ఎప్పటికప్పుడు జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టింది. కానీ కూటమి ప్రభుత్వం తమకేమి పట్టీపట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జ్వరాలతో పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

నెల్లూరు కల్లూరుపల్లికి చెందిన 60 ఏళ్ల రమణమ్మ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఆమె శనివారం నగరంలోని పీపీసీకి వెళ్లింది. అక్కడి వైద్యులు రక్త పరీక్షలు చేయించగా 1:160 వైడల్ పాజిటివ్ అని తేలింది. అంటే టైఫాయిడ్ ఉన్నట్లు నిర్ధారించారు. డాక్టర్ ఫీజు, రక్త పరీక్షలకు మొత్తం రూ.800, మందులకు రూ.320 ఖర్చయింది. ఆటో ఖర్చులకు మరో రూ.250 ఖర్చులయ్యాయి. ఇతర ఖర్చులకు ఇంకో రూ.200.. ఈ లెక్కన ఒక్క రోజులోనే రూ.1,600 ఖర్చు అయింది. మరో పది రోజుల పాటు ఇంటి వద్దనే ఉండాల్సి ఉంది. కూలి పనులపై ఆధారపడే ఆ కుటుంబం ఈ పది రోజులు బతుకుదెరువు లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. అది పీపీసీ కాబట్టే అంతమాత్రం ఖర్చు అయితే.. అదే ఇతర ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అంతకు రెండింతలు, మూడింతలు ఖర్చు అవుతుంది. ఇదే గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులను ఏ కుటుంబం ఎదుర్కోలేదని ఎంతో మంది పేదలు వాపోయారు.

జిల్లాలో ఇద్దరు డెంగీతో మృత్యువాత



పెద్దాస్పత్రిలో ఓపీ కోసం క్యూలో పెద్ద సంఖ్యలో నిలుచున్న రోగులు



నగరంలోని శంకరాగ్రహారంలో ఓ ఆస్పత్రి వద్ద వేచి ఉన్న రోగులు

ఎన్ఎస్1 కిట్‌లో పాజిటివ్ వస్తే అంగీకరించరట

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్ఎస్1 కిట్ పద్ధతిలో డెంగీను నిర్ధారిస్తారు. ఇందులో పాజిటివ్ వచ్చిన వారిలో సైతం ప్లేట్‌లెట్స్ (రక్తకణాలు) తగ్గిపోతున్నాయి. ఒక్కో దఫా రోగి ప్రమాదంలోకి కూడా పోతున్నాడు. డెంగీ లక్షణాలు ఉన్నా.. పాజిటివ్ వచ్చినా వైద్యశాఖ దానిని పరిగణనలోనికి తీసుకోవడం లేదు. కేవలం ఎలీసా పద్ధతిలో మాత్రమే పరీక్ష చేసి అందులో పాజిటివ్ వస్తేనే డెంగీగా నిర్ధారిస్తామని చెబుతోంది. ఎలీసా పరీక్షలు కేవలం సర్వజన ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లోనే చేస్తున్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎలీసా పరీక్షలు చేయడం లేదు.

గతంలో ఇంటింటా ఫీవర్ సర్వే..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెల ఫీవర్ సర్వేలు జరిగేవి. ఇంటింటికి వెళ్లి ఆరోగ్య కార్యకర్తలు జ్వరాలపై ఆరా తీసేవారు. ఎక్కడైనా జ్వరాలు నమోదైతే అక్కడ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి విష జ్వరాలను, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటిని నియంత్రించేవారు. ఇప్పుడు సర్వే అనే మాటే లేదు. ఎవరి చావు వాడు చావాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టి తమను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరు(అర్బన్): జిల్లాలో జూన్ నుంచి క్రమేపి డెంగీ కేసులు పెరుగుతున్నాయి. ఇతర వైరల్ ఫీవర్స్ నమోదవుతున్నాయి. జిల్లాలో ఉదయగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల్లో డెంగీతో ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. అయితే వైద్యశాఖ మాత్రం జనవరి నుంచి ఇప్పటి వరకు 8 నెలల కాలంలో 52 డెంగీ కేసులు, 3 మలేరియా కేసులు మాత్రమే నమోదైనట్లు చెబుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదవుతున్న డెంగీ పాజిటివ్ కేసులను వైద్యశాఖ అంగీకరించడం లేదు. నెలకు 300 డెంగీ కేసులు నమోదవుతున్నాయని ప్రైవేట్ వైద్యులు చెబుతున్నారు.

పెద్దాస్పత్రిలో పరిస్థితిని పరిశీలిస్తే..

నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఈ నెలలో 10 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇతర జ్వరాలకు సంబంధించి దాదాపు 50 మందికి పైగా అడ్మిట్ అయ్యారు. జ్వరాలతో బాధపడుతూ డాక్టర్ వద్ద మందులు రాయించుకుని ఔట్ పేషెంట్లుగా (ఓపీ) ఇంటికి వెళ్లిన వారు 1000 మంది వరకు ఉన్నారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతూ డెంగీ, ఇతర సీజనల్ జ్వరాలు పెద్దగా లేవని చెబుతోంది.

జిల్లాలోని ఆస్పత్రుల్లో..

జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆత్మకూరులో ఒక జిల్లా ఆస్పత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆస్పత్రులు, నెల్లూరులోని దర్గామిట్టలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. ఇవికాకుండా వైద్యశాఖలో రిజిస్టర్ చేసుకుని ఉన్న 450 ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు నడుస్తున్నాయి. రిజిస్టర్ కానటువంటి క్లినిక్‌లు మరో 100 వరకు ఉన్నాయి. వీటన్నింట్లో రోగులకు డాక్టర్లు వైద్య సేవలందిస్తున్నారు. కనీసం ప్రతి రోజు సగటున అన్ని ఆస్పత్రుల్లో కలిపి 20 వేల మందికి పైగా రోగులు వస్తున్నారు. అందులో దగ్గు, విషజ్వరాలతో దాదాపు 8 వేల మంది వరకు వస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా ఆస్పత్రులన్నీ రోగులతో కిట, కిటలాడుతున్నాయి. రక్తపరీక్షలు చేసే ల్యాబ్‌ల వద్ద రద్దీ విపరీతంగా ఉంటోంది.

ఒక ప్రైవేట్ ఆస్పత్రిలోనే 370 డెంగీ కేసుల నమోదు



నెల్లూరు విజయమహల్ రైల్వేగేటు సమీపంలోని ఒక ప్రజా వైద్యశాలను పరిశీలించగా జనవరిలో 74 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరిలో 33, మార్చిలో 43, ఏప్రిల్‌లో 47, మేలో 44, జూన్‌లో 16, జులైలో 49, ఆగస్టులో ఇప్పటి వరకు 64 కేసులు నమోదయ్యాయి. ఇదే ఆస్పత్రిలో ప్రతి రోజు వైరల్, సాధారణ జ్వరాలతో 10 మందికి పైగా అడ్మిట్ అవుతున్నారు. జ్వరాలతో మందులు రాయించుకుని ఇంటికెళ్లే వారి సంఖ్య 35గా ఉంది. ఇక టైఫాయిడ్ కేసులు కూడా ప్రతి రోజూ నమోదవుతూనే ఉన్నాయి. ఈ ఒక ఆస్పత్రిలోనే 370 డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని మిగతా ఆస్పత్రుల్లో నెలకు కనీసం 2 వేల డెంగీ కేసులు నమోదవుతున్నాయని ఐఎంఏ అధికారులు అంచనా వేస్తున్నారు.



నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో అడ్మిట్ అయిన రోగులు

జ్వరాలు నియంత్రణలోనే ఉన్నాయి



జిల్లాలో వైరల్ ఫీవర్‌లు, డెంగీ, మలేరియా వంటి కేసులు నియంత్రణలోనే ఉన్నాయి. ఉధృతంగా లేవు. సీజనల్‌గా కాస్త పెరిగాయి. వాటి నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. రక్తకణాలు తగ్గినంత మాత్రాన డెంగీగా నిర్ధారించకూడదు. ఎలీసా పద్ధతిలోనే పరీక్షలు చేసి పాజిటివ్ వస్తే డెంగీగా నిర్ధారిస్తాం. జ్వరాల నియంత్రణకు అన్ని పీహెచ్‌సీల డాక్టర్లను అప్రమత్తం చేశాం. మందులన్నీ అందుబాటులో ఉంచాం.
– పెంచలయ్య, డీఎంహెచ్ఓ

మంత్రి ఆనం మనసు మారాలి

- నాగదేవతకు పొంగళ్లు

ఆత్మకూరు: పట్టణంలోని కొలగాని రామయ్య సత్రం భూముల విషయంలో మంత్రి ఆనం మనసు మారాలని, తమకు న్యాయం జరగాలని కోరుతూ ఆ ప్రాంతంలో నివసించే కుటుంబాలు ఆదివారం జేఆర్‌పేటలోని నాగదేవత శిలల వద్ద పొంగళ్లు పెట్టారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. కొలగాని రామయ్య సత్రం స్థలాలు దేవదాయశాఖకు చెందినవని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ అధికారులు పేర్కొంటూ దశాబ్దాలుగా ఆ స్థలాల్లో స్థిర నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. సర్వే నంబరు 1965/ఏలో వందల కుటుంబాలు దాదాపు ఏడు దశాబ్దాలకుపైగా నివసిస్తున్నారు. కొంత కాలంగా ఈ స్థలం పంచాయతీదని, అసైన్డ్ భూమని, దేవదాయశాఖకు చెందినదని ఇలా పలువురు పేర్కొంటూ ఈ ప్రాంతవాసులను అయోమయానికి గురి చేస్తున్నారని మహిళలు తెలిపారు. ఇన్నేళ్ల నుంచి పూరిగుడిసెలు, రేకుల ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న పేదవారిపై కక్ష కట్టి మంత్రి, దేవదాయశాఖ అధికారులు నిర్దాక్షిణ్యంగా ఖాళీ చేయించే కుట్ర చేస్తున్నారని, వారి మనసు మార్చుకుని పేదలకు సహాయ పడేలా నాగార్పమ్మ కనికరించాలని మొక్కుకుని పొంగళ్ల నైవేద్యాలుగా సమర్పించినట్లు మహిళలు పేర్కొన్నారు.



ఆత్మకూరులో నాగదేవతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మహిళలను లక్షాధికారులను చేయడమే లాఖ్‌పతీ దీదీ ప్రధాన లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి
- మహారాష్ట్రలోని జల్గావ్ నుంచి ప్రధాని మోదీ సందేశం
- నెల్లూరు కలెక్టరేట్ నుంచి హాజరైన అధికారులు, మహిళలు



స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని 1.20 లక్షల మంది మహిళలను లక్షాధికారులుగా తయారు చేయడమే ప్రధాన లక్ష్యంగా లాక్‌పతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం మహారాష్ట్రలోని జల్గావ్‌లో లాఖ్‌పతీ దీదీ సమ్మేళన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మోదీ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, స్వయం సహాయక సంఘాల మహిళలు వర్చువల్‌గా హాజరయ్యారు. సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని పొదుపు సంఘాల్లో మహిళలను గుర్తించి వారికి అవసరమైన జీవనోపాదులను కల్పించి లక్షాధికారులను చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఇప్పటికే కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ ద్వారా మహిళల ఎంపికను పూర్తి చేసినట్లు చెప్పారు. మహిళలకు వివిధ వ్యాపారాలకు అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు, రుణ సదుపాయం కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏడాది లక్ష రూపాయలకు పైగా ఆదాయాన్ని ఆర్జించి ఉపాధి అవకాశాలను విస్తరించడమే లాఖ్‌పతీ దీదీ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. అనంతరం జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలకు ప్రశంసా పత్రాలను, 869 స్వయం సహాయక సంఘాలకు రూ.105.75 కోట్లు లాక్‌పతి దీదీ బ్యాంకు రుణాల చెక్‌ను, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రూ.7 కోట్లు ఉన్నతి రుణాలను, స్త్రీనిధి ద్వారా రూ.50 కోట్లకు సంబంధించిన బ్యాంకు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శారమ్మ, ఏపీడీ రాజు, ఏపీఎంలు, డీపీఎంలు స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు జాతీయ క్రీడల దినోత్సవ వేడుకలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్ఓ ఆర్కే యతిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ వేడుకల్లో 26వ తేదీ క్విట్ ఇండియా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27వ తేదీ 18–40 ఏళ్ల వయస్సు వారికి 100 మీటర్ల పరుగు, బ్రిస్క్ వాక్, వాలీబాల్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 40–60 ఏళ్ల వయస్సు వారికి 50 మీటర్ల పరుగు, 300 మీటర్ల వాక్, టగ్‌ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 60 ఏళ్ల పైబడిన వారికి 50 మీటర్ల వాక్, యోగా నిర్వహిస్తామన్నారు. 28వ తేదీ వాక్, పరుగు, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు, బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్‌తో పాటు ఫన్‌గేమ్స్, లెమన్ అండ్ స్పూన్ రేస్, రోప్ జంప్, ఖోఖో తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ ఉదయం 8 గంటలకు జాతీయ క్రీడాదినోత్సవ ర్యాలీని స్టేడియం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో రాణించిన క్రీడాకారులను సన్మానిస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఉదయం 8.30 గంటలకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ వెంకట్రావును 88862 28444 నంబరులో సంప్రదించాలన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ జె.వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీ నుంచి సెప్టెంబరు 11వ తేదీ వరకు 20 రోజుల్లోగా ఉప కమిషనర్, దేవదాయశాఖ, గుంటూరు వారికి తమ దరఖాస్తులను పంపాలని ఆయన తెలిపారు.

గంజాయి స్మగ్లర్ అరెస్ట్

- పోలీసులను కారుతో ఢీకొట్టి పరారైన నిందితులు
- 78 కేజీల గంజాయి, కారు స్వాధీనం
- విశాఖ నుంచి తిరుపతికి అక్రమ రవాణా
- పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్)/మనుబోలు: గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుకోబోయిన పోలీసు అధికారులను ఢీకొట్టి పరారైన ఘటనలో గంజాయి స్మగ్లర్‌ను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 78 కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మనుబోలు పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు దర్యాప్తు అధికారి, నెల్లూరు నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన ఎ.సత్యనారాయణ అలియాస్ సతీష్ మరో ఇద్దరితో కలిసి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన నిందితులు విశాఖ ఏజెన్సీలో 73 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తిరుపతిలో ఎక్కువ ధరలకు విక్రయించేందుకు కారులో బయలుదేరారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు పక్కా సమాచారం అందడంతో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ గంజాయి తరలిస్తున్న కారును తనిఖీ చేసేందుకు యత్నిస్తుండగా నిందితులు పోలీసులను ఢీకొట్టుకుంటూ పరారయ్యారు. డీఎస్పీ శ్రీనివాసరావు కిందపడడంతో తల, కంటిపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులను అప్రమత్తం చేయగా నిందితులు గూడూరులో వాకాడు సీఐ, ఆత్మకూరు వద్ద ఆత్మకూరు సీఐలను ఢీకొట్టి పరారయ్యారు. ఈ ఘటనపై వెంకటాచల సత్రం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పొదలకూరు, వెంకటాచలం, కోవూరు సీఐలు రాంబాబు, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఒకరిని అదుపులోకి తీసుకుని..

గంజాయి స్మగ్లర్లలో కారు డ్రైవింగ్ చేస్తున్న సత్యనారాయణను ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. డీఎస్పీని ఢీకొట్టి పరారయ్యే సమయంలో మనుబోలు సమీపంలోని వీరంపల్లి ఫ్లై ఓవర్ వద్ద చెట్లలో గంజాయిని దాచి పెట్టినట్లు వెల్లడించారు. దీంతో మనుబోలు పోలీసులు నిందితులపై గంజాయి అక్రమ రవాణాపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్‌చేసి 73 కేజీల గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వృత్తి ఫొటోగ్రాఫీ.. ప్రవృత్తి గంజాయి స్మగ్లింగ్

సత్యనారాయణ ఫొటో గ్రాఫర్‌గా జీవనం సాగించేవాడు. గంజాయి వ్యాపారం లాభసాటిగా మారడంతో స్మగ్లర్‌గా అవతారమెత్తారు. స్నేహితులతో కలిసి ముఠాగా ఏర్పడి విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి వివిధ మార్గాల ద్వారా రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కమిషన్ పద్ధతిపై సరఫరా చేస్తున్నాడు. గతంలో కర్ణాటక రాష్ట్రంలో గంజాయి సరఫరా చేస్తుండగా అక్కడి పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం తిరిగి తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది.

ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు

పరారీలోని నిందితుల కోసం ఓ వైపు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేపట్టారు. నిందితులు ఎవరి వద్ద గంజాయిని కొనుగోలు చేశారు? తిరుపతిలో ఎవరెవరికి వాటిని విక్రయించేందుకు తీసుకెళుతున్నారు తదితర వివరాలను ఇప్పటికే సేకరించి వారిపై సైతం చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ ఘటనలో నిందితుడిని త్వరితగతిన అరెస్ట్ చేయడంతో పాటు గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో పొదలకూరు సీఐ రాంబాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక చట్టం అవసరం



వైద్య వృత్తిలో ఉంటున్న మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ ఉండేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కోల్‌కతాలో జరిగిన ఘటనను దృష్టి పెట్టుకుని అలాంటివి జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ హజరత్‌రెడ్డి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ అల్లీపురం పీహెచ్‌సీ

పూర్తిస్థాయిలో నిఘా



డాక్టర్లు, సిబ్బంది రోగులకు నిత్యం సేవలందిస్తుంటారు. వారికి ప్రభుత్వం తాము అండగా ఉన్నామని ధైర్యం కల్పించాలి. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయిలో నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో మహిళా డాక్టర్‌లు, సిబ్బంది విధుల్లో ఉంటారు. వారి కోసం పోలీసు బందోబస్తు కల్పించాలి.

– డాక్టర్ కె.బలరామ్‌నాయక్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, అల్లీపురం పీహెచ్‌సీ

ఇలాంటి సంఘటనలు దారుణం



ఇటీవల కోల్‌కతాలో, నిన్న తిరుపతిలో డాక్టర్లపై దారుణానికి ఒడిగట్టడం, దాడికి పాల్పడడం బాధాకరమైన విషయం. డాక్టర్లు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తుంటారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేసే వారికి రక్షణ తప్పనిసరి. ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ షేక్ అస్మా, వైద్యాధికారిణి, ఆత్మకూరు



హత్యలు.. దొంగతనాలు.. దాడులు

కూటమి ప్రభుత్వంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

- జిల్లాలో చెలరేగిపోతున్న దొంగలు
- బరితెగిస్తున్న గంజాయి స్మగ్లర్లు
- పోలీసులపైనా దాడులు
- ప్రశ్నార్థకంగా మారిన నిఘా

నెల్లూరు వెంకటేశ్వరపురంలో విశ్రాంత ఉద్యోగి ఇంట్లో రూ.10 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బీవీ నగర్ రైల్వే గేట్ సమీపంలో వేణుగోపాల్ అనే వ్యక్తి హత్య జరిగింది. జయభారత్ ఆస్పత్రి సమీపంలో పెయింట్ పనిచేసే శ్రీనివాసులుపై ప్రత్యర్థులు బీరు బాటిళ్లతో దాడి చేసి హత్యాయత్నం చేశారు. నగరంలో వృద్ధురాలిపై దాడి చేసి డబ్బు దోచుకున్నారు. ఓ మండలంలో యువతిపై లైంగికదాడి జరిగింది. ఇవన్నీ ఈనెలలో చోటుచేసుకున్న ఘటనలు. కూటమి ప్రభుత్వంలో జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని చెప్పేందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

నెల్లూరు(క్రైమ్): ఓ వైపు హత్యలు.. మరోవైపు దొంగతనాలు.. ఇంకోవైపు లైంగికదాడులు, హత్యాయత్నాలు.. ఇలా వరుస ఘటనలు జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొసమెరుపేంటంటే రక్షకులకే రక్షణ కొరవడింది. గంజాయి స్మగ్లర్లు ఆ స్థాయిలో బరితెగించారు. పాతనేరస్తులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన నేరగాళ్లు జిల్లాలో మకాం వేశారు. ఇల్లు విడిచి బయటకు వెళ్తే

స్వల్ప కారణాలతో హత్యలు



హత్యకు గురైన వేణుగోపాల్ (ఫైల్)

చిన్నచిన్న కారణాలతో హత్యలు జరుగుతున్నాయి. ఈనెల 2వ తేదీన నెల్లూరులో క్షణికావేశంలో అన్నను తమ్ముడు అతి కిరాతకంగా చంపాడు. భార్యను కాపురానికి పంపలేదని షఫీ తన మామను అతి కిరాతకంగా హత్య చేశాడు. పద్ధతిగా జీవించమని చెప్పినందుకు మన్నేపల్లి వేణు అనే వ్యక్తిని ప్రత్యర్థులు అతి కిరాతకంగా చంపారు. జిల్లాకు చెందిన కొందరు కిరాయి హంతకులుగా మారారు. సుపారీ తీసుకుని ఇతర జిల్లాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు నగరానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల ప్రకాశం జిల్లాలో సుపారీ హత్య చేసి నగరానికి వచ్చేశారు. అక్కడి పోలీసులు దర్యాప్తు చేసి యువకులను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఇలాంటి వ్యక్తుల కదలికలపై నిఘా కొరవడింది.



నెల్లూరులో దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

చాలు హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ సంపాదించుకున్న మొత్తాన్ని క్షణాల్లో దోచేస్తున్నారు. పాతకక్షలు, కుటుంబకలహాలు, ఇతరత్రా కారణాలతో హత్యలు జరుగుతున్నాయి. బాలికలకు ఇంటా, బయట రక్షణ కరువైంది. కామంతో కళ్లుమూసుకుపోయిన కొందరు కామాంధులు వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. లైంగికదాడియత్నాలు, వేధింపులు, హత్యాయత్నాలు, దాడుల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరమే లేదు. కొందరు జిల్లావాసులు ఇతర జిల్లాల్లో కిరాయి హత్యలు, మాదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కి జైలుపాలవుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు నేరాలకు పాల్పడి నెల్లూరులో తలదాచుకున్న ఘటనలు నిఘా వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. పోలీసుల నిఘా, గస్తీ కేవలం సైరన్‌కే పరిమితమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఎస్పీ కఠిన చర్యలు చేపట్టకపోతే జిల్లాల్లో శాంతిభద్రతలకు మరింత విఘాతం కలిగే అవకాశం ఉంది.

తాళం వేస్తే ఇట్టే..

జిల్లాలో దొంగలు విజృంభిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. మోటార్‌బైక్‌లను అపహరించడమే కాకుండా కాల్చివేస్తున్నారు. ఈనెల 17వ తేదీన అర్ధరాత్రి వరికుంటపాడు మండలంలో చోరీలకు పాల్పడుతూ ఓ వ్యక్తి బైక్‌ను తగులబెట్టారు. మహిళ మెడల్లోని బంగారు గొలుసులను తెంపుకెళ్తున్నారు. ఆలయాలకు భద్రత కొరవడింది. వాహన దొంగతనాలు జోరుగా సాగుతున్నాయి. పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా కొరవడింది.

విచ్చలవిడిగా..

జిల్లాలో గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. ఇటీవల కావలి పోలీసులు తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. నెల్లూరు సంతపేట పోలీసులు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. విద్యార్థులు, యువతే లక్ష్యంగా విక్రయాలు సాగుతున్నాయి. జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి పెద్దఎత్తున తరలివెళ్తోంది. ఇటీవల తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వెలుగులోకి వచ్చిన మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా కేసుల్లో జిల్లాకు చెందిన కొందరి ప్రమేయం బహిర్గతమైంది. నగరానికి చెందిన కొందరిని తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నెల్లూరు నగరంలో పలువురికి విక్రయించినట్లు సమాచారం.

పాపం

మహిళలు, బాలికలు, యువతులకు రక్షణ కరువైంది. ప్రేమ పేరుతో మృగాళ్లు వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. తాజాగా నెల్లూరు నగరానికి చెందిన ఓ మహిళను స్నేహితుడు తన వెంట తీసుకెళ్లి వెంకటాచలం అటవీ ప్రాంతంలో విచక్షణారహితంగా దాడి చేశాడు. ముఖంపై తీవ్రగాయాలు కావడంతో ఆమె చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రయా హాస్పిటల్‌కు వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లైంగిక దాడియత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

దర్యాప్తులో ఉండగానే..

సంచలనం రేకెత్తిస్తున్న ఘటనల్లో పోలీసుల దర్యాప్తుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన ఘటనలు జరిగిన సమయంలో వాటి మూలాలు తెలుసుకునేందుకు పోలీసులు రహస్య విచారణ సాగిస్తుంటారు. అయితే జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. విచారణ అధికారులో? అక్కడున్న సిబ్బంది ద్వారానే విచారణలోని ప్రతి అంశం నిమిషాల వ్యవధిలోనే బయటకు వచ్చేస్తుంది. దీంతో అసలు నిందితులు తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. తాజా ఘటనలో ఈ విషయం తేటతెల్లమైంది. గంజాయి స్మగ్లర్‌ను పోలీసులు విచారిస్తున్న వీడియో సోషల్ మీడియాలో కనిపించడం దర్యాప్తు తీరును బహిర్గతం చేస్తోంది. ఇలాంటి చర్యలు నేరస్తులు తప్పించుకునేందుకు ఊతమిచ్చే విధంగా ఉన్నాయి.

బరితెగించి..



గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడిన రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు (ఫైల్)

గత తెలుగుదేశం పాలనలో జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లు కోట్ల రూపాయల విలువైన ఎర్రసంపదను అక్రమంగా తరలించారు. అడ్డొచ్చిన పోలీసులపై కాల్పులు, దాడులకు యత్నించారు. అప్పట్లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జైళ్లకు పంపారు. ప్రస్తుతం గంజాయి స్మగ్లర్లు బరితెగిస్తున్నారు. తాజాగా గంజాయి తరలింపుపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు కాపుకాచి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా వాహనంతో ఢీకొట్టి పరారయ్యారు. డ్రైవర్ చిక్కగా మిగిలిన ఇద్దరు నిందితులు గంజాయితో సహా వెళ్లిపోయారు. ఈ ఘటనలో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావుతోపాటు ఆత్మకూరు సీఐ, తిరుపతి జిల్లా వాకాడు సీఐలకు గాయాలయ్యాయి.



వరికుంటపాడు మండలంలో కాల్చేసిన బైక్ (ఫైల్)

దాడి చేసేందుకు..

ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులకూ ఈ ప్రభుత్వంలో రక్షణ కొరవడింది. పోలీసులపై దాడి చేసేందుకు వెనుకాడడం లేదు. ఇటీవల నెల్లూరు నగరంలో ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై ఉన్నతాధికారుల సాక్షిగా కొందరు టీడీపీ చోటా నాయకులు దౌర్జన్యం చేయడంతోపాటు దాడికి యత్నించారు. నడిరోడ్డుపై మహిళా ట్రాఫిక్ ఎస్సైపై దాడి చేసిన ఘటన పోలీసు శాఖలో కలకలం రేకెత్తించింది. పోలీసులపై గంజాయి స్మగ్లర్ల దాడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగిస్తోంది.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు పట్టుకున్న వాహనం

సంగం: మండల కేంద్రమైన సంగం నాలుగు రోడ్ల సెంటర్ వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బొలెరో ట్రక్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. 60 బస్తాల రేషన్ బియ్యాన్ని అనంతసాగరం మండలం నుంచి నెల్లూరులోని ఓ రైసుమిల్లుకు తరలిస్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందింది. వారు చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బొలెరో ట్రక్‌లో రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.

వృద్ధుడి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుచ్చిరెడ్డిపాళెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పి.వెంకటేశ్వర్లు (60) నగర పంచాయతీ పరిధిలోని బాలకృష్ణానగర్ గిరిజన కాలనీలో ఉంటున్నాడు. జీవితంపై విరక్తితో ఆయన శనివారం ఇంట్లో పురుగు మందు తాగాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వెంకటేశ్వర్లును ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

కండలేరులో 5.898 టీఎంసీలు



జలాశయం (ఫైల్)

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 5.898 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 650 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 85, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో..

- వివాహిత మృతి

దొరవారిసత్రం: మండలంలోని కృష్ణప్పకండ్రిగ వద్ద అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేణుంబాకం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన చిలకల రమేష్ భార్య శాంతి(36) శనివారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీలు, స్థానికులు రాత్రంతా గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం కృష్ణప్పకండ్రిగ గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద వేప చెట్టుకు ఆమె మృతదేహం వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుమలరావు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

పెళ్లకూరు: మండలంలోని కానూరు రాజుపాళెం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై ఆదివారం ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 19 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. 10 మోటార్‌బైక్‌లు, 17 సెల్‌ఫోన్లు, రెండు కోళ్లు, రూ.3,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 112
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 226
లేయర్ చికెన్	: 178

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే..
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'నియోజకవర్గంలో 98 శాతం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారు. వారందరూ కూడా నిత్యం ప్రజల్లోనే ఉండాలి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలి' అని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచించారు. కావలి పట్టణంలోని ఆరెస్సార్ కల్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి మోసపూరిత హామీలు ఇవ్వడం వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలు తాము పొరపాటు చేశామని అర్థం చేసుకుంటున్నారని, భవిష్యత్ వైఎస్సార్ సీపీదే అని చెప్పారు. టీడీపీ నాయకులకు భయపడకుండా అభివృద్ధి పనులను ప్రోత్సహిస్తూ, ప్రజలకు నష్టం కలిగించే పనులు చేస్తే మాత్రం నిలదీయాలని సూచించారు. గతంలో కావలి ఎమ్మెల్యేగా పనిచేసిన వారెవరూ చిరుద్యోగులను తొలగించి వారి కడుపు కొట్టిన చరిత్ర లేదన్నారు. కానీ ఇప్పుడు చిరుద్యోగులు జీవనోపాధి కోల్పోయేలా టీడీపీ ఎమ్మెల్యే పనిచేస్తుండడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన కొందరు వ్యక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులకు కూడా పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని, అందరికీ ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న వారు భవిష్యత్‌లో తీవ్ర పర్యావసానాలు అనుభవించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దిబోయిన వీర రఘు యాదవ్, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జంపాని రాఘవులుగౌడ్, బీద రమేష్, పత్రి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

తోటపల్లిగూడూరు: మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. స్థానిక ఎస్సై జంపానీకుమార్ కథనం మేరకు.. ఇటీవల మల్లికార్జునపురం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం టీడీపీ కార్యకర్తలు తాళ్లూరు జీవరత్నం, ముదివర్తి సురేష్, తాళ్లపాక శీనయ్య, ముదివర్తి మహేష్, తాళ్లూరు మణిరత్నం, దామర్ల ఆనంద్, పొన్నూరు మార్క్, పొన్నూరు బర్నాబాస్‌లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కత్తి శీనయ్య, కత్తి సంజీవయ్య, పొన్నూరు హనుమంతయ్య, పొన్నూరు పోలయ్య, ఈదూరు యోహాన్, ఈదూరు రాజా, మానికుల శీనయ్యతో గొడవకు దిగారు. ఘర్షణలో రెండు వర్గాలకు చెందిన ఐదుగురు గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదులతో తోటపల్లిగూడూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. తమపై దాడి చేసినట్లు తెలిసినా పోలీసులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి కేసు నమోదు చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



ఫైనల్లో తలపడిన నెల్లూరు – గుంటూరు జట్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో నాలుగురోజులుగా జరుగుతున్న తాటిపర్తి సునీల్‌కుమార్ స్మారక రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ20 క్రికెట్ పోటీలు ముగిశాయి. ఆదివారం బుజబుజనెల్లూరు సీఐఏ క్రికెట్ మైదానంలో గుంటూరు, నెల్లూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. నెల్లూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసిన విజయం సాధించింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మామిడితోట దగ్ధం

- ఆకతాయిల నిర్వాకం

ఆత్మకూరు: ఆకతాయిల కారణంగా మామిడితోట దగ్ధమైన ఘటన ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మెడబల్లి నరహరి అనే వ్యక్తికి అప్పారావుపాళెంలోని పెన్నా బ్రిడ్జి సమీపంలో మామిడితోట ఉంది. ఆదివారం రాత్రి ఒక్కసారిగా తోటలో మంటలు కనిపించడంతో సమీపంలోని వారు నరహరికి తెలిపారు. అతను అందించిన సమాచారం మేరకు ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే పది చెట్లకుపైగా కాలిపోయాయి. సమీపంలోని తాటిచెట్లకట్టకు మంటలు అంటుకోవడంతో పక్కతోటలోకి వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు తెచ్చేందుకు ముమ్మరంగా ప్రయత్నించారు. ఏ మేరకు నష్టం జరిగిందో తెలియాల్సి ఉంది.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ ఒకే సం//లో 10th/ఇంటర్ పాస్! దూర విద్య ద్వారా BA, B.Com, BSc, BBA, BCA, BLIS, MA, M.Com, MCA, MBA, MLIS & Ph.D (Nursing). Cont: 9030030126. [T-2257]

REAL ESTATE

PLOT FOR SALE

■ నెల్లూరు టౌన్‌లో DTCP అప్రూవ్డ్ లేఅవుట్ నందు ప్లాట్లు అమ్మకమునకు కలవు. 1 అంకణం రేటు: 60,000. మురళిరెడ్డి ప్రాపర్టీస్. సెల్ : 89776 66665, 90525 48944. [NA-23689]

■ 22సెంట్లు 7.50లక్షలకే 96 శ్రీగంధం మొక్కలతో ప్రకాశం జిల్లా, అద్దంకి దగ్గర పూర్తి డెవలప్‌మెంట్స్‌తో శ్రావణమాసం ఆఫర్ బ్యాంకాక్ ట్రిప్ (6 రోజులు) సంప్ర॥ ✆ 9523456789 [B-1248571]

■ గజం 2499/-కే హైదరాబాద్ హైవే నార్కట్‌పల్లి దగ్గర 4 లైన్ రోడ్డు పక్కన ఫాంల్యాండ్ వెంచర్‌లో కాటేజస్, స్విమ్మింగ్‌పూల్,గోశాల,ఎర్రచందనం, పండ్ల మొక్కలతో 1210గజాలు (10 గుంట లు) ప్లాట్లు కలవు. ఫోన్: 9390261598 [HA-10862]

WANTED

■ Wanted Maths (1-3) Teacher & Wardens (Male / Female). Sri Netaji Pilot High School, Nellore. Further Details Contact : 94414 34138, 85005 52203. [NA-11190]

■ ప్రముఖ హోమ్ సర్వీసెస్ నందు హౌస్‌కీపింగ్ చేయుటకు యువతి, యువకులు కావలెను. వివరాలకు సంప్రదించండి: 70237 78899. [NA-23695]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ / పురుషులు కావలెను. Qul:10th–డిగ్రీ, Sal: 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [G-9010]

■ Airtel Air Fiber నెల్లూరులో పని చేయుటకు టెక్నీషియన్స్-6,సేల్స్‌ఎగ్జిక్యూటివ్స్-4,లేడీ కంప్యూటర్ ఆపరేటర్స్-2 కావలెను. కొత్త వారికి ప్రాధాన్యత. జీతం:20,000 to 30,000. సెల్ : 8639192162. [NA-23678]

■ మా ఆఫీసు నందు TeleCaller, HR మేనేజర్ అర్జెంటుగా కావలెను. Exp 3 to 5 yrs. Qlf : Degree to PG. 9 to 5 PM. వివరాలకు సంప్రదించండి : 94930 27149. [N-1253573]

■ PK Assc. నందు EMI పద్ధతిలో Gold అమ్ముటకు మండలాల వారీగా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 15000/- + ఇన్సెంటివ్. సెల్ : 89856 96117, 63034 03389. [NA-11192]

■ టైడ్ డయాగ్నోస్టిక్స్, పొగతోట, నెల్లూరు నందు పని చేయుటకు అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. (మహిళలకు ప్రాధాన్యత). 99636 65571, 90323 56555. [NA-2892]

■ స్నేహ కౌన్సిలింగ్ & మైండ్ థెరపీ సెంటర్ నెల్లూరు. లేడీ రిసెప్షనిస్టులు కావలెను. జీతం : 10k, టైం : 10 AM to 8 PM. వివరాలకు సంప్రదించండి. సెల్ : 93467 08090. [NA-23675]

■ అనుభవజ్ఞులైన Male & Female నర్సులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరాలకు SSK Global Diabetic Center, Nellore. Cell : 99631 78776. [NA-11187]

■ జిరాక్స్ షాపు నందు పని చేయుటకు Computer అనుభవం ఉన్న యువతీ యువకులు కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్ : 91607 11786. [NA-11188]

■ హౌస్ కీపింగ్ స్టాఫ్(జీ:19,400),సె.గార్డు(జీ: 16,000,అన్నిమండలాల్లో)టెంపుల్ సె.గార్డ్ (జీ: 13,000),ITIటెక్నీషియన్స్(జీ:16,500) అన్ని రకాల ప్రభుత్వఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు: 9059054495. [T-2263]

■ కన్సల్టెన్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15–40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. ఫోన్: 7995984445 [HA-98255]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796269]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.